ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : సద్గురు శ్రీ నాన్నగారు

సంపుటి : 10 సంచిక : 9 పుష్పం : 19-20 20-01-2005

రమణ భాస్కర

ఆధ్యాత్మిక పక్ష పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

చందా
సంవత్సర చందా:రు॥100/-
విడి ప్రతి : రు॥ 8/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

07-12-04
విశాఖపట్నం ............ 1

15-12-04
ఆలమూరు ............ 10

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, ☎ 08814 - 228858

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 07-12-2004, విశాఖపట్నం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భక్తులు చాలామంది శ్రద్ధగా సాధన చేసుకొంటున్నారు కాని అండర్‌స్టాండింగ్ తక్కువగా ఉంది, అవగాహన లోపం చాలా ఉంది. వెర్రితనం, సోమరితనం, అమాయకత్వం, ఉద్రేకపడి ఏదో పనిచేయటం, ఎరుకలేకుండా వ్యవహరించటం ఇవి ఏమీ జ్ఞానం కాదు. ఇంతకుముందు ఎవరో నా దగ్గరకు వచ్చి నాన్నగారు ఈ మధ్య నాకు ఎక్కువ విరక్తి వస్తోంది అన్నారు. విరక్తి అంటే వారి ఉద్దేశం ఏదో వైరాగ్యం అనుకొంటు న్నారు. మనకు ఎప్పుడయినా కోపం వచ్చినప్పుడు, ఇంట్లో పరిస్థితులు అనుకూలంగా లేనప్పుడు చిరాగ్గా ఉంటాము, ఈ విషయాలు నాకెందుకు అనుకొంటాము. అదంతా వైరాగ్యం కాదు. అవగాహన లోపం వలన మనకు వివాదాలు వస్తాయి, అశాంతి వస్తుంది, జ్ఞాపకశక్తి తగ్గిపోతుంది. మన జీవితంలో జయాపజయాలు, లాభనష్టములు, గౌరవం, అగౌరవం వస్తూ ఉంటాయి. మనకు వివేకం ఉంటే ఇవి ఏమీ అనిపించవు. సమానమైన నష్టం ఇద్దరకు వచ్చింది అనుకోండి, ఒకరు మామూలుగా ఉంటారు, ఒకరు విపరీతమైన బాధకు గురి అవుతారు, మనస్సు ఆ సంఘటనను తీసుకోవటంలో ఉంటుంది. మనం జీవితంలో జరిగే ప్రతి చిన్నసంఘటనను సీరియస్‌గా తీసుకోకూడదు. దేహం ప్రారబ్ధాన్ని బట్టి నడుస్తూ ఉంటుంది. ప్రతీ సంఘటనను సీరియస్‌గా తీసుకొంటే మనం జీవించటం కష్టమవు తుంది. కొంతమందికి లాభం వస్తే వారి సంతోషాన్ని పట్టుకోలేము, నష్టం వస్తే కుంగిపోతూ ఉంటారు, ఇది మంచి పద్ధతి కాదు. జయాపజయములను, లాభనష్టములను సమానంగా తీసుకొంటూ నీ బ్రెయిన్‌ను బేలెన్స్ చేసుకోవటం నేర్చుకో అని భగవంతుడు చెపుతున్నాడు. ఇదంతా ఏమిటి అనుకోవద్దు, అమృతానుభవం పొందటానికి ఇదంతా సాధనలో ఒక భాగము. లాభం వస్తే రానివ్వండి, నష్టం వస్తే రానివ్వండి ఇవి ఈ జన్మకు సంబంధించినవి కావు, ఇటువంటి

శరీరాలు ఎన్నో మోసాము. ఉదాహరణకు మనకు ఏదైనామంచి తలంపు వచ్చింది అనుకోండి దానికి కూడా భగవంతుడు బహుమతి ఇస్తాడు అలాగే మనకు ఏదైనా చెడు తలంపు వచ్చింది అనుకోండి దానికి పనిష్మెంట్ కూడా భగవంతుడు ఇస్తాడు. అయితే ఆత్మజ్ఞానానికి, నేను చెప్పే ఈ మాటలకు ఏమీ సంబంధం లేదు. కాని విషయం అర్థం అవ్వటం కోసం ఇవన్నీ చెపుతున్నాను. కర్తురాజ్ఞయాప్రాప్యతే ఫలం కర్మ కిం పరం కర్మ తజ్జడం అక్కడ కర్త అంటే వాడు సర్వజ్ఞుడు, సర్వమూ తెలిసినవాడు, వాడు సర్వస్వతంత్రుడు, వాడు ఎవడికయితే ఎరుకపడాలి అనుకొన్నాడో వాడికి ఎరుకపడతాడు కాని ఎవరూ వాడిని ప్రశ్నించటానికి వీలులేదు. కొంతమంది మాకు రోజులు బాగా వెళ్లిపోతున్నాయి అని అంటారు అంటే ఏమీలేదు అది మంచి స్వప్నం. కొంతమంది మేము చాలా కష్టపడుతున్నాము, రోజూ ఇబ్బందులు పడుతున్నాము అంటారు అంటే అది చెడు స్వప్నం. వీటికి అసలు సత్యానికి ఏమీ సంబంధం లేదు. దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టి మన పని ఏదో మనం జాగ్రత్తగా చేసుకొంటూ ఉండాలి, లోచూపు నేర్చుకోవాలి. మనం పొందవలసింది పొందటానికి ప్రయత్నం చెయ్యాలి. మనకు ఎక్కడ మార్పు రావాలో అక్కడ మార్పు రావటం లేదు. కార్లు వచ్చాయి, రైళ్ళు వచ్చాయి, ఇంట్లో అన్ని కంఫర్ట్స్ ఉన్నాయి అయినా మనం ఎందుకు అశాంతిగా ఉంటున్నాము అంటే మనం ఎక్కడ మారాలో అక్కడ మారటం లేదు. సైన్సును బట్టి ఏదో వచ్చేస్తుంది అనుకోవద్దు అది లోపల ఏమీ మార్పు తీసుకొనిరాలేదు. కొన్ని వేల సంవత్సరాల పూర్వం మానవస్వభావం ఎలా ఉందో ఇప్పుడు కూడా అలాగే ఉంది. ఇది సమిష్టిగా పొందేది కాదు. నీ మనస్సు బాగుపడటానికి నువ్వు ప్రయత్నం చేసుకో, నిన్ను నీవు ఉద్ధరించుకో. ముందు సెల్ఫ్ రిఫామ్ తరువాత సోషల్ రిఫామ్. నిన్ను నీవు బాగు చేసుకోకుండా ఎవరినో బాగుచేస్తాను అంటే అది అర్థంలేనిమాట.

మానవ స్వభావంలో పెత్తందారీతనం ఎక్కువగా ఉంటుంది. ఇంట్లో నలుగురు ఉంటే ప్రతీవాడూ పెత్తనం చేయటానికి సిద్ధమవుతాడు. ఎటాచ్మెంట్ ఉన్నప్పుడే అహంకారం పెరుగుతూ ఉంటుంది. భూకంపం వచ్చింది అనుకోండి, గాలివాన వచ్చింది అనుకోండి అది ఈశ్వరునికి తెలియకుండా రాదు. మీ జీవితంలో ఏ సంఘటన జరిగినా అది ఈశ్వరుడికి తెలియకుండా ఏమీ జరగటానికి వీలులేదు. అందుచేత మీరు ఏదో ఊహించుకొని ప్రతీచిన్న విషయానికి భయపడవద్దు. అలా మీరు భయపడుతూ ఉంటే మీ మీద మీకు విశ్వాసం లేదు, ఈశ్వరుడి యొక్క అస్థిత్వం మీద మీకు విశ్వాసం లేదు. మీకు విశ్వాసం ఉన్నట్లు కనిపిస్తున్నారు కాని మీరు విశ్వాసహీనులు అనేవారు ఏసుక్రీస్తు. 30 రూపాయలు లంచం పుచ్చుకొని ఆయన శిష్యుడే క్రీస్తును ప్రభుత్వానికి పట్టించాడు. దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టి లోపల ఆత్మజ్ఞాన సముపార్జనకు కృషి చేసుకొంటూ ఉంటే దేహం ద్వారా జరిగేది జరిగిపోతూ ఉంటుంది. మంచి జరుగుతూ ఉంటుంది, చెడు జరుగుతూ ఉంటుంది, లాభం వస్తుంది, నష్టం వస్తుంది ఇలా ఏది జరిగినా వాటి ప్రభావం మన మనస్సుమీద పడదు.

నా మనస్సు మీద నాకు అదుపు లేనప్పుడు, నా ఇంద్రియాల మీద నాకు అదుపు

లేనప్పుడు, నా శరీరం మీద నాకు అదుపు లేనప్పుడు, నేను తీసుకొనే ఆహారం మీద నాకు అదుపు లేనప్పుడు నాకు ఎన్నివేల కోట్లు ఉన్నా నేను సుఖపడలేను, నాకు శాంతి రాదు, ఇది సిద్ధాంతం. మన మీద మనకు అదుపులేనప్పుడు ఎంత ధనం ఉన్నా, ఎన్ని వాహనాలు ఉన్నా, ఎంత అధికారం ఉన్నా మనం సుఖపడము, స్వరూపజ్ఞానం మనకు రాదు. బుద్ధుడు ప్రశాంతంగా కూర్చొని భక్తులకు బోధ చేస్తున్నాడు. ఎక్కడనుండో ఒక భక్తుడు వేగంగా వచ్చి ఆయన చెవిలో ఏదో చెప్పాడు. అతను చెప్పినది ఏమిటి అంటే మన భక్తులు ఒకరు అడవి మార్గంలో వస్తుండగా దొంగలు అతనిని చంపేసారు, ఆ వర్తమానం మీకు తెలియజేయటానికి నేను వచ్చాను అని బుద్ధుడితో చెప్పాడు. అలాగ ఈ కడసారిజన్మలో వాడి శరీరం అలా చంపబడిందా? వాడు లోపల ఫ్రీ అయిపోయాడే, వాడు పొందవలసింది పొందాడే, కడసారి జన్మలో ఆ శరీరం ఇలా చంపబడిందా అని కళ్ళు మూసుకున్నాడు. వెనకటిజన్మకు వెళ్ళి చూసాడు ఏమీ కనబడలేదు. రెండోజన్మకు, మూడోజన్మకు అలా వెనుకకు వెళ్ళి చూసాడు ఏమీ కనబడలేదు, అయిదో జన్మకు వెళ్ళాడు. అయిదో జన్మలో అతను తల్లి దండ్రులను చంపేసాడు. చంపాలని చంపలేదు కాని కోపం వచ్చి తల్లితండ్రులను గట్టిగా కొట్టేస్తే తల్లితండ్రులు చనిపోయారు. అది అయిదు జన్మలకు పూర్వం జరిగింది. ఇప్పుడు వాడికి ఫ్రీడమ్ వచ్చేసింది. అప్పుడు చేసిన పొరపాటుకు ఇప్పుడు ఈశరీరం దొంగలచేత చంపబడింది, కాని వాడికిమటుకు నన్ను దొంగలు చంపుతున్నారు, నేను చంపబడుతున్నాను అని ఏమీలేదు. వాడు సంతోషంగా శరీరాన్ని వదిలాడు ఎందుచేతనంటే నేను ఈ శరీరానికి పరిమితమై ఉన్నాను అనే పరిమితబుద్ధి అంతకు ముందే పోయింది. వాడి శరీరం చంపబడుతున్నా కూడా నేను చంపబడుతున్నాను అనే తలంపు వాడికిలేదు ఎందుచేతనంటే లోపల ఫ్రీ అయిపోయి ఉన్నాడు.

జ్ఞానికి సంచితం పోతుంది, అగామి పోతుంది, ప్రారబ్దం అనుభవించవలసిందే అని శాస్త్రంలో చెపుతారు కాని భగవాన్ ఏమని చెప్పారు అంటే దశరధునికి ముగ్గురు భార్యలు కదా, దశరధుడు చనిపోయినప్పుడు ముగ్గురికీ వైధవ్యం వస్తుంది కాని ఇద్దరికి వచ్చి మిగతా వారికి ఆగిపోతుందా అని అడిగారు అంటే ముగ్గురికీ వైధవ్యం వస్తుంది. ఇక్కడ కూడా అంతే, దేహంతోటి తాదాప్యం పొందే తలంపుకే కదా ప్రారబ్దమయినా, సంచితమయినా, ఆగామి అయినా వాడు పోయినప్పుడు ఈ మూడూ కూడా లేవు, అంటే ప్రారబ్దం కూడా లేదు అని చెప్పారు. మరి మీ దేహానికి కేన్సర్ వచ్చింది కదా అని భగవాన్‌ను అడిగారు. రమణమహర్షిగారికి కేన్సర్ వచ్చింది, చాలా బాధ పడుతున్నారు, ప్రారబ్దం అనుభవిస్తున్నారు అని చూచేవాడు అనుకొంటాడు కాని కర్మనేను అనుభవిస్తున్నాను అనుకొనే వాడు అక్కడ ఉంటే వాడికి జ్ఞానంలేదు. నేను ప్రారబ్దం అనుభవిస్తున్నాను అని రమణమహర్షి అనుకొంటే వాడు జ్ఞానే కాదు. దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టండి. ఏదో జరిగిపోతుంది అని మీరు భయాలు పెట్టుకోవద్దు. భయం వలన మానసిక అనారోగ్యము, శారీరక అనారోగ్యము

వస్తుంది. మన పని మనం చేసుకొంటూ వెళ్ళిపోతూ ఉండాలి, లోపల శాంతిగా ఉండాలి, ఆనందంగా ఉండాలి.

భగవంతుడు మనలను ఇటువంటి కుటుంబంలో పడేసాడు ఏమిటి? మన ప్రారబ్ధం ఇలాఉంది ఏమిటి? అని అనుకోకండి. నువ్వు ఏ కుటుంబంలో పుట్టాలో అది నీ ఇష్టంకాదు. నీ చేతిలో లేనిదాని గురించి ఆలోచించి కాలాన్ని వృధాచేసుకొంటున్నావు. వృత్తి కూడా భగవంతుడే నిర్ణయిస్తాడు. వృత్తేకాదు ప్రతీచిన్న సంఘటన కూడా భగవంతుడి నిర్ణయం ప్రకారం జరుగుతుంది. ప్రారబ్ధంలో ఉన్నదే వస్తూ ఉంటుంది. అయితే నీకు దేహంతో తాదాప్యం పోయినప్పడు అది నిన్ను అంటదు, ముట్టదు. దేహం ప్రారబ్ధం అనుభవిస్తూ ఉంటుంది కాని లోపల నువ్వు పొందవలసింది పొందటానికి ప్రయత్నం చేస్తూఉంటే అనుభవించటం వలన ప్రారబ్ధం ఖర్చయిపోతుంది, ఈలోపులో మనకు జ్ఞానం వచ్చేస్తుంది. కాని మనం ఏమి చేస్తున్నాము అంటే లోపల పొందవలసింది పొందటానికి ప్రయత్నం ఏమీ చేయకుండా ప్రారబ్ధంలో జరిగే సంఘటనలతో తాదాప్యం పొందుతున్నాము, మనం ఏదిగా ఉన్నామో దానితో తాదాప్యం పొందటానికి ప్రయత్నం చేయటం లేదు. ఇలా కాలాన్ని వృధా చేసుకొంటున్నాము, జీవితాన్ని పాడుచేసుకొంటున్నాము. ఇక్కడే వివేకం అవసరం. మనం వివేకంగా జీవించాము అనుకోండి ఒక ప్రక్కన ప్రారబ్ధం ఖర్చయిపోతుంది రెండో ప్రక్క జ్ఞానం వచ్చేస్తుంది అంటే ఒకే సమయంలో రెండు పనులూ పూర్తి అయిపోతాయి. మనం లోపలకు ప్రయాణం చేయకుండా, ఆత్మవిచారణ చేయకుండా దేహానికి జరిగే సంఘటనలతో తాదాప్యం పొందుతూ ఉంటే కాలం, శక్తి వృధా అవుతాయి. ఉన్నదేదో ఉంది, లేనిదేదో లేదు. దుఃఖం ఎప్పడూ లేదు, అది మీరు కల్పించుకొన్నదే. ఎప్పడూ ఉన్నదానిని ఉన్నట్లు తెలుసుకోవటం, లేనిదానిని లేనట్లు తెలుసుకోవటమే నీ జీవితగమ్యం.

మనం జీవితంలో ఎందులోనైనా సక్సెస్ అవ్వాలంటే శాంతచిత్తం అవసరం. మనం లోపల ప్రశాంతంగా ఉండాలి. మనకు రాగద్వేషాలు లేవు అనుకోండి మనం కోటిమంది మధ్యలో ఉన్నా ఏకాంతంగా ఉంటాము. లోపల రాగద్వేషములు ఉంటే, మనస్సులో పెంట అంతా ఉంటే గదిలో తలుపులు వేసుకొని కూర్చొన్నా మనం ధ్యానం చేసుకోలేము, ఏడుస్తూ కూర్చొంటాము. మీకు మనస్సులో శాంతి లేనప్పడు తలుపులు వేసుకొని కూర్చొంటే ఏకాంత వాసం వస్తుందా? రానేరాదు. మనం గుమ్ఖంలాగ పనిచేయాలి, సన్యాసిలాగ జీవించాలి అని భగవంతుడు గీతలో చెప్పాడు. పనిని మనం బలవంతంగా విడిచిపెట్టకూడదు. దేహ ప్రారబ్ధంలో ఉన్నప్పడు ఆపనిని మనం ఇష్టంగా చేసేయాలి. ఆపనిని మనం బలవంతంగా విడిచిపెడతాము అనుకోండి అదేపనిని భగవంతుడు రాబోయే జన్మలో మనకు కేటాయించి వడ్డీతో సహా చేయిస్తాడు. మనం చేసే పనిని నిర్మలంగా చేసుకొంటూ పోవాలి, గుర్తింపులు కోరుకోకూడదు. మేము చాలా చాకిరీ చేస్తున్నాము కాని ఎవరూ గుర్తించటంలేదు అని కొంతమంది చెపుతూ ఉంటారు. గుర్తింపులు ఎవరికి? అహంకారానికి గుర్తింపులు కావాలి.

అజ్ఞానానికి గుర్తింపులు కావాలి కాని జ్ఞానికి గుర్తింపులు ఎందుకు. అజ్ఞానికి ఇతరులు ఉన్నారు కాని జ్ఞానికి ఇతరులు లేరు. ఇప్పుడు మనం ఏదైతే నేను, నేను అంటున్నామో ఆనేనే అజ్ఞానం, అదే అహంకారం, పొంగిపోయేది కుంగిపోయేది ఆ నేనే, ఇక్కడే ఉంది మొత్తం పుండు అంతా, దానిని తీసి ఒక ప్రక్కన పెట్టటమే సాధన. ఈ నేనే అహంకారంగా, అజ్ఞానంగా, మమకారంగా కనిపిస్తోంది, బంధాలు పెట్టుకొనేది ఇదే మరల అందులో నుండి విడుదల పొందాలి అని ప్రయత్నం చేసేది ఇదే.

నేను ఎందుకు పుట్టానో నాకే తెలియటం లేదండి అని ఇంతకుముందు ఒక అమ్మగారు నాతో చెపుతున్నారు. మీరు ఎందుకు పుట్టారు అంటే మీరు ఎవరో మీరు తెలుసుకోవటానికి పుట్టారు అని చెప్పాను. మనం ఎవరో మనం తెలుసుకోవటానికి భగవంతుడు ఒక అవకాశం ఇచ్చాడు. మనం ఎవరో మనం తెలుసుకొంటే ఇంక ఈ శవాలను మోయవలసిన పని మనకు లేదు. మనం ఎవరో మనం తెలుసుకోవటమే ఈ జీవితం యొక్క ప్రయోజనం. ఒకవేళ అది తెలుసుకోకుండా ఏదో సాధించాము అనుకోండి అవన్నీ ఒకటి లేని సున్నలతో సమానము. సన్యాసం అంటే మనస్సుకు సంబంధించినది, కేవలం బట్టలు మార్చుకోవటం సన్యాసం కాదు, నువ్వు చేస్తున్న పనిని విడిచిపెట్టటం సన్యాసం కాదు, ఇంటిలో నుండి పారిపోవటం సన్యాసం కాదు. నీ చేతిలో ఉన్న పని చేసుకొంటూనే నీ మనస్సును ఎక్కడ పెట్టాలో అక్కడ పెట్టాలి. రామకృష్ణుడు చెపుతాడు "ముందు నీవు ఒక చేత్తోటి నీపని చేసుకో, రెండో చేత్తోటి దేవుని పాదాలని పట్టుకో. కొంత టైము అయ్యేటప్పటికి ఈ చెయ్యి కూడా దేవుని పాదాలమీద పడిపోతుంది" అంటే పని నిన్ను విడిచిపెట్టేస్తుంది అది స్లోగా నీకు తెలియకుండానే జరిగిపోతుంది. అదృష్టం, దురదృష్టం అనేవి వట్టిమాటలు. అందులో ఏమీ లేదు. అదృష్టం ఎవరికి? మనస్సుకి, దురదృష్టం ఎవరికి? మనస్సుకు. లోపలఉన్న చైతన్యానికి అదృష్టంలేదు, దురదృష్టంలేదు, వీటితో దానికి ఏమీ సంబంధం లేదు. నువ్వు చైతన్యం అయి ఉన్నావు. నువ్వు ఏదిగా ఉన్నావో దానికి అదృష్టం లేదు, దురదృష్టం లేదు. దేహప్రారబ్ధాన్నిబట్టి నీవు ఏపని చేసుకొంటున్నప్పటికీ నువ్వు లోచూపు నేర్చుకో, నీ మనస్సును లోపలకు తోలుకొని వెళ్ళు. మనస్సును ఎండబెట్టు అంటారు భగవాన్. జయం వచ్చినప్పుడు పొంగిపోతూ ఉంటే, అపజయం వచ్చినప్పుడు కృంగిపోతూ ఉంటే మనస్సుకు ఆహారం అందుతుంది. మొక్కమొదట్లో నీరుపోస్తూ అది చనిపోవాలి అంటే అదెక్కడ చనిపోతుంది, నీరు పొయ్యటం మానివేస్తే మీరు దానిని చంపనక్కరలేదు, అదే చనిపోతుంది. అందుచేత మనస్సుకు నీళ్ళు పోయటం మానివేయండి, దానిని శుభ్రంగా ఎండబెట్టండి అప్పుడు దానంతట అదే వాడిపోయి రాలిపోతుంది. మీ జీవితంలో ఏవో సంఘటనలు జరుగుతూ ఉంటాయి, వాటికి రియాక్టు అవుతున్నారు అనుకోండి ఇంక మనస్సు ఎండదు, ఏమీ రియాక్టు అవ్వరు అనుకోండి మీ మనస్సు నెమ్మదిగా నశిస్తుంది, ఇప్పుడే ఇక్కడే మీకు బ్రహ్మజ్ఞానం కలుగుతుంది. మిమ్మల్ని ఎవరైనా పొగిడినా, విమర్శించినా

మీ మనస్సు రియాక్టు అవ్వదు అనుకోండి, మీరు ప్రశాంతంగా ఉండగలుగుతున్నారు అనుకోండి, అప్పుడు మీ మనస్సు ఎండిపోయి రాలిపోతుంది. ఆ ప్రక్రియ వదిలేసి మేము ఏదో చేస్తున్నాము అంటే ఏదో చేయటం వలన మీ మనస్సు నశించదు. మీరు సబ్జక్టును ప్రోపర్‌గా అర్థం చేసుకోవాలి. మీరు మనస్సును ఎండగట్టరు అనుకోండి, మనస్సుకు లోచూపు నేర్పరు అనుకోండి, మనస్సు పలచబడుతోందో, లేదో చూసుకోరు అనుకోండి మీరు ఎన్ని గంటలు సాధన చేసినా, ధ్యానాలు చేసినా వాటివలన ప్రయోజనం లేదు. మీరు చేసే సాధనల వలన మనస్సు పల్చబడాలి, మనస్సు సన్నగిల్లాలి లేకపోతే మనస్సు నశించదు.

దేహం ఏపని మీద ఈ భూమి మీదకు వచ్చిందో ఆ పని జరిగిపోతూ ఉంటుంది. అది ఎక్కడ ఉండాలి, దాని ద్వారా ఏ పని జరగాలి అది జరిగిపోతూ ఉంటుంది. గుమ్ములూరులో శేషమ్మగారు అనే అమ్మగారికి ముగ్గురు కుమారులు. పిల్లలు చిన్నప్పుడే తండ్రిపోయారు. పిల్లలు బుద్ధిమంతులు, బాగా చదువుకొన్నారు, అమెరికా వెళ్ళి బాగా సంపాదించుకొంటున్నారు. మనబ్బాయిలు అక్కడ బాగానే ఉన్నారు, మనం గుమ్ములూరులో మన ఇంటివద్ద మనం ఉండాలి, సముద్రం దాటి వెళ్ళకూడదు అని ఆవిడ ఉద్దేశం. అబ్బాయిలు ఏమన్నారు అంటే కష్టపడి మమ్మల్ని అభివృద్ధిలోనికి తీసుకొని వచ్చావు, బతికి ఉండగా నిన్ను చూసుకోకుండా మేము ఏదో అమెరికాలో గొప్పస్థితిలో ఉన్నాము అంటే ఆ ఊరేగింపుల వలన ప్రయోజనం ఏమిటి. నువ్వు సముద్రందాటి అమెరికాకు రాకపోతే నీకోసం మేమే ఇండియా వచ్చేస్తాము అని చెప్పారు. ఆవిడ వెళ్ళను అన్నారు కాని చివరకు ఆవిడను వప్పించి అమెరికా తీసుకొని వెళ్ళారు. ఇప్పుడు అమెరికాలో హేపీగానే ఉన్నారు. నేను సముద్రం దాటి వెళ్ళను అని అన్నారు, ఆవిడ ప్రయత్నం ఏమయ్యింది? ఆ దేహప్రారబ్దంలో అమెరికాలో ఉండవలసి ఉంటే విధి నిన్ను అలా తీసుకొనిపోతుంది. అర్జునుడితో అదే భగవంతుడు గీతలో చెప్పాడు. ఒకవేళ నువ్వు యుద్ధం చెయ్యనని కూర్చున్నా ప్రారబ్దం నీచేత చేయిస్తుంది, నీ స్వభావం నీచేత యుద్ధం చేయిస్తుంది, ఆ స్వభావం ముందు నిగ్రహం కూడా ఆగదని చెప్పాడు.

నీకు ఇష్టం ఉన్నా, ఇష్టం లేకపోయినా నువ్వు ఏపని చేయటానికి వచ్చావో ఆపని నీ ద్వారా జరిగిపోతూ ఉంటుంది. ఇష్టం లేకుండా చేస్తే కొత్తసంస్కారాలు వస్తాయి, ఇష్టం ఉండి చేస్తే కొత్తసంస్కారాలు రావు, పాతసంస్కారాలు పోతాయి. నువ్వు ఫ్రీ అయిపోతావు. ఇదే గీతలో చెప్పింది. మీ ఇంట్లో వారిని మీరు చూడాలి అనుకోండి, అయిష్టంగా చూసినా మీకు చూడటం తప్పదు. అందుచేత ఆచూచేది అయిష్టంగా కాకుండా ఇష్టంగా చూస్తారు అనుకోండి మనలో పునర్జన్మ హేతువులు నశిస్తాయి, కొత్త వాసనలు ఏమీ అంటుకోవు. అందుచేత మీ ప్రారబ్దంలో ఏది ఉంటే అది జరిగిపోతూ ఉంటుంది. మీ ద్వారా ఏదైనా మంచి జరిగింది అనుకోండి, నేను గొప్పవాడిని అని అనుకోవద్దు, ఒకవేళ మీ ద్వారా ఏదైనా చెడ్డ జరిగింది అనుకోండి కుంగిపోవద్దు, విధి అలా తీసుకొనివస్తుంది. నీ మనస్సును

లోపలకు పంపటానికి ప్రయత్నం చెయ్యి. నువ్వు ఏదిగా ఉన్నావో దానితో తాదాప్యం పొందటానికి ప్రయత్నం చెయ్యి. అది ఒక్కటే నీచేతిలో ఉంది మిగతాది ఏదీ నీ చేతిలో లేదు. నువ్వు కానిదానితో తాదాప్యం పొందుతున్నావు, అందుచేత నీకు దుఃఖం వస్తోంది. మనో దేహములతో నీకు తాదాప్యం లేనప్పడు నీకు దుఃఖం రాదు. నువ్వు ఏదిగా ఉన్నావో దానితో తాదాప్యం పొందినప్పడు నీకు దుఃఖం రాదు. జనాన్ని పోగుచేసుకొందాము అనే బుద్ధి ఉన్నవాడు ఎవడూ అసలు గురువు కాదు, అదో రకమైన లోకవాసన. జనాన్ని ఎలాగ పోగుచేసుకొందామా అని చూసుకొంటూ ఉంటే అసలు నీ మనస్సు ఎలా లోపలకు వెళు తుంది. మనకు ఏదైనా తలంపు వచ్చింది అనుకోండి. మనలో దేహవాసనగాని, లోకవాసన గాని ఏదో ఉండి ఉండాలి. ఇవి లేనప్పడు మనకు ఏతలంపు రాదు. లోపలఉన్న వస్తువు నార్మల్‌గా ఉంది, నేచురల్‌గా ఉంది. అందుచేత నీ బిహేవియర్ నార్మల్‌గా ఉంటే, నేచురల్‌గా ఉంటే అది నీకు తెలియబడుతుంది అని భగవాన్ చెపుతూ ఉండేవారు.

ఇప్పడు మనకు అందరికి శరీరాలు ఉన్నాయి, ఆ శరీరాన్ని నేను అనుకొంటున్నాము. అక్కడ నుండి దుఃఖం ప్రారంభమవుతోంది, దానిని విడిచిపెడితే లోపల ఉన్న ఆనందసముద్రం పొంగి నీ సహస్రారాన్ని ముంచుతుంది. మీకు ఏదైనా దుఃఖం వచ్చింది అనుకోండి, కంగారుపడవద్దు, అది మీ స్వరూపంలో లేదు. మీ దేహానికి చావు వచ్చింది అనుకోండి, కంగారు పడవద్దు, అది మీ స్వరూపంలో లేదు. ఈ చావు పుట్టుకలకు, గౌరవాలు అగౌరవాలకు, లాభనష్టాలకు అతీతమైనది మీ స్వరూపం, అక్కడ అసలు ద్వంద్వాలు లేనేలేవు. దేని గురించి నీవు ఆందోళన చెందుతున్నావో అది నీ కల్పితమే కాని నీ స్వరూపంలో అది లేదు. అది నీ స్వరూపంలో లేదు అని నీకు అర్థమయినప్పడు నీకు ఆందోళన లేదు, మనస్సు యొక్క చాపల్యం కూడా ఆగిపోతుంది. మీరు అందరు దుఃఖరహితస్థితిని పొందాలి, అది బజారులో కొనుక్కునేది కాదు. మీరు పండితులు అనుకోండి, మీకు డబ్బు ఉంది అనుకోండి అయినా మీకు దుఃఖం వస్తూ ఉంటే మీ పాండిత్యం ఏమి చేసుకొంటారు, మీ డబ్బు ఏమి చేసుకొంటారు. ఇదే భగవాన్ చెపుతున్నారు మీరు ఎ/సి గదిలో ఉన్నారు అనుకోండి, కాళ్ళ కింద ఒక టిక్కా, తలకింద ఒక టిక్కా, మెత్తని పరుపు ఇవి అన్నీ ఉన్నాయి అనుకోండి, అయినా మీకు నిద్రపట్టటం లేదు అనుకోండి, ఇవి అన్నీ ఏమి చేసుకొంటారు? నాకు నిద్రపట్టకపోయినా ఫరవాలేదు ఇవి అన్నీ ఉన్నాయి అని ఎవడయినా అనుకొంటాడా? ఎవడూ అనుకోడు. అలాగే నీవు దుఃఖరహితస్థితిని పొందలేనప్పడు నీకు ఎన్ని ఉన్నా వాటివలన ప్రయోజనం లేదు. మీరు సబ్జక్టు ప్రోపర్‌గా అర్థం చేసుకొంటున్నారు అనుకోండి, జ్ఞానం పొందటానికి చెమట పట్టించుకోనక్కరలేదు. ఇప్పడు మీరు నిద్రపోతున్నారు అనుకోండి గాఢనిద్రలో నుండి మెలుకువ వచ్చినప్పడు మీరు ప్రశాంతంగా మేల్కంటారు అలాగే మీరు సబ్జక్టు అర్థం చేసుకోవటం వలన అంత ప్రశాంతంగా, జ్ఞానంలోనికి మేల్కంటారు. మీ ప్రారబ్దాన్ని బట్టి సంఘటనలు జరుగుతూ ఉంటాయి.

మీరు ఆ సంఘటనలతో తాదాప్యం పొందటం విడిచిపెట్టకపోతే మీరు సాధన చెయ్యలేరు, మీకు ఆత్మజ్ఞానం రాదు. ఇప్పుడు ఎవరో మిమ్మల్ని తిట్టారు అనుకోండి అందువలన మీకు వచ్చే నష్టం ఏమిటి? పైగా శాస్త్రంలో ఇంకొకటి చెప్పారు మిమ్మల్ని ఎవరైనా తిట్టారు అనుకోండి లోపల కూడా మీరు తిట్టుకోకుండా మౌనంగా ఉన్నారు అనుకోండి, మీ దేహ ప్రారబ్దంలో ఏదైనా పాపం ఉంటే ఆ పాపం వారికి ట్రాన్స్ఫర్ చేస్తాడు. భగవాన్ దగ్గరకూర్చొని ఒక భక్తుడు మనస్సులో ఎవరినో తిడుతున్నాడు. భగవాన్ ఏమి చెప్పారు అంటే మీరు ఎవరినో తిడుతున్నారు అలా వద్దు నన్ను తిట్టుకోండి. మీరు ఎవరినయితే తిడుతున్నారో వారికి మనస్సు ఉంది, వారు బాధపడతారు, భవిష్యత్‌లో ఆ బాధ మీరు పడవలసి వస్తుంది. ఇక్కడ మనస్సు లేదు అందుచేత నన్ను తిట్టుకోండి. మనస్సు ఉంటే వారికి బాధ వస్తే మీకు కర్మసిద్ధాంతం అంటుకొంటుంది. నన్ను తిట్టుకోండి నేను బాధపడను కాబట్టి మీకు ఇబ్బంది లేదు. ప్రారబ్దాన్ని బట్టి నీ దేహం ద్వారా జరగవలసింది జరిగిపోతూ ఉంటుంది. కాని నువ్వు శాంతిగా ఉండు, నీవు ఏదిగా ఉన్నావో దానితో తాదాప్యం పొందటం అలవర్చుకో, నీకు ఉన్న ఫ్రీడం అది ఒక్కటే.

మన ఇంటిలో పది మంది కుటుంబ సభ్యులు ఉన్నారు అనుకోండి. ఏదో మన గురించి వారు కష్టపడిపోతున్నాము అనుకొంటారు లేకపోతే వారిగురించి మనం కష్టపడిపోతున్నాము అనుకొంటాము. మనకు కర్తృత్వం ఉంది కాబట్టి అలా అనుకోకుండా ఉండలేము. ఏదో మన డ్యూటీ మనం చేస్తున్నాము వారికి మనకు సంబంధం లేదు అని లోపల అనుకొంటూ ఉండాలి ఎందుచేతనంటే నిజంగా వారికి మనకు సంబంధం లేదు కాబట్టి, కళ్ళు మూస్తే ఏమీలేదు. మన దేహమే మనం కానప్పుడు, వారి దేహం వారు ఎలా అవుతారు అనేవారు భగవాన్. ప్రారబ్దం అలా తీసుకొనివచ్చింది అందుచేత మన డ్యూటీ ఏమో మనం చెయ్యాలి, ఆ చేసేది ఇష్టంతో చెయ్యాలి. ఇటువంటి కుటుంబంలో పుట్టాము ఏమిటి? అని కొంతమంది అనుకొంటూ ఉంటారు. అలా అనుకోవద్దు. అక్కడ మీరు కొన్ని అనుభవాలు పొందవలసి ఉంది అందుచేత భగవంతుడు అక్కడకు మిమ్మల్ని పంపించాడు. ఆయనకు తెలియకుండా ఏమీ జరుగదు. నువ్వు ఏది చేసినా మామూలుగా డ్యూటీగా చేస్తే ఇబ్బంది లేదు కాని మమకారం పెట్టుకొని, అహంకారం పెట్టుకొని చూస్తూ ఉంటే తప్పని సరిగా నీవు బంధింపబడతావు. ఉదాహరణకు మీ ఇంట్లో పిల్లలు చదువుకొంటూ ఉంటారు. వారికి చదువుకోవటానికి ఏవో అవకాశాలు మీరు ఇస్తారు. వారికి ఎక్కువ మార్కులు వస్తే సంతోషిస్తున్నారు అనుకోండి, తక్కువ మార్కులు వస్తే దుఃఖపడుతున్నారు అనుకోండి, అది మమకారం. వారికి ఎన్ని మార్కులు వచ్చినా మీరు ఫ్రీగా ఉన్నారు అనుకోండి, మీ పని మీరు చేస్తున్నారు అనుకోండి, మీ డ్యూటీ మీరు చేస్తున్నట్లు అవుతుంది. డ్యూటీ చేయటం వేరు, మమకారం వేరు. డ్యూటీ చేయటం వలన దుఃఖం రాదు, మమకారం పెట్టుకోవటం వలన దుఃఖం వస్తుంది. మమకారమే పాపం, అంతకంటే పాపం ఏముంది

ఈ సృష్టిలో అని భగవాన్ ఒక సందర్భంలో చెప్పారు. మీ ఇంట్లో పిల్లలకు ఎక్కువ మార్కులు వస్తే సంతోషిస్తారు అదే పక్కింటి పిల్లలకు ఎక్కువ మార్కులు వస్తే మీకు సంతోషంరాదు, దానికి మీ మనస్సులో ఉన్న ఇరుకు కారణం. మనస్సే ఆ తేడాలను తీసుకొని వస్తోంది, పునర్జన్మలకు కూడా ఆ మనస్సే కారణం. ఎవరైనా మిమ్మల్ని చెడ్డవారు అని అంటే మేము మంచివారమే అని చెప్పకోవలసిన పని ఏముంది? అహంభావన లేనప్పుడు వాదములతోటి, వివాదములతోటి పని ఏముంది. రోజూ మనం ఎన్నో మాటలు మాట్లాడుతూ ఉంటాము. అందులో అవసరం ఉండి మాట్లాడే మాటలు తక్కువ ఉంటాయి, అవసరం లేని మాటలు ఎక్కువ ఉంటాయి, మనంతట మనం చూసుకొంటే అది మనకే తెలుస్తుంది. అహంకారాన్ని కేంద్రంగా పెట్టుకొని మాట్లాడే మాటలు ఎక్కువ ఉంటాయి. అక్కడ ఏవో మహిమలు జరుగుతున్నాయి అని అనుకొంటాము అనుకోండి ఇంక మన మనస్సు బాహ్యముఖానికి వెళ్ళిపోతుంది కాని లోపలకు వెళ్ళదు. మీకు రాజసిక ప్రవృత్తి ఉన్నప్పుడు, తామసిక ప్రవృత్తి ఉన్నప్పుడు మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది. అందుచేత నీవు సత్వగుణాన్ని అలవర్చుకో. సాత్వికగుణం ఉన్నప్పడే మీ మనస్సుకు లోచూపు కలుగుతుంది. అసలు మనస్సుకు లోచూపు కలుగజేయటం కంటే మించిన మహిమ లేదు. పూర్వజన్మల గురించి, భవిష్యత్‌జన్మల గురించి ఎవరైనా చెప్పారు అనుకోండి అది జ్ఞానమా అనేవారు భగవాన్. నీ హృదయంలో ఒక సద్వస్తువు ఉంది. అది ఎంత సహజంగా ఉందో, ఎంత నిదానంగా ఉందో, అది ఎలా ఉందో అలా ఉండగలగటం జ్ఞానం, అదీ జ్ఞానం అంటే. లోకంలో జరిగే సంఘటనల ద్వారా మీరు ప్లెజర్ తీసుకొన్నా, పెయిన్ తీసుకున్నా ఇంక మీ మనస్సు అణగదు, మనోనాశనం కాదు. మీ దేహప్రారబ్ధంలో ఏదయినా జరగవలసి ఉంటే మీకు కోరిక లేకపోయినా అది జరుగుతుంది. మీకు కోరిక ఉన్నా అది ప్రారబ్ధంలో లేకపోతే జరుగనే జరుగదు ఎందుచేతనంటే కోరికకు శక్తిలేదు, శక్తి ఈశ్వరుడిది. అందుచేత ఈశ్వరసంకల్పంలో ఉంటేనే అది జరుగుతుంది లేకపోతే జరుగదు.

ఒకోసారి మన సంకల్పం ఈశ్వర సంకల్పం కలుస్తుంది, కలిసినప్పడు కూడా జరిగేది ఈశ్వరసంకల్పమే కాని మనం ఏమనుకొంటాము అంటే మన తెలివితేటల వలన అది సాధించాము అనుకొంటాము. మన సంకల్పం ఈశ్వర సంకల్పం కలవనప్పడు కూడా జరిగేది ఈశ్వరసంకల్పమే. జరగనప్పడు ఈశ్వరుడిని పట్టుకొని తిడతాము, జరిగినప్పడు మన తెలివితేటలు అనుకొంటాము, పొగరుబోతుతనం పెంచుకొంటాము, దానివలన దేహగతమైన నేను పెరిగిపోతూ ఉంటుంది. ఈ దేహగతమైన నేను జడం పార్టీకాదు, చైతన్యం పార్టీకాదు. వాడు మధ్యలో వచ్చాడు, మధ్యలో వచ్చాడు కాబట్టి విచారణ చేస్తే పోతాడు. విచారణ చేయము అనుకోండి కోటిజన్మలు ఎత్తినా వాడు అలాగే ఉంటాడు. కేవలం మన తెలివితేటల వలన అది పోదు. గురువు అనుగ్రహం, ఈశ్వరానుగ్రహం వలన అదిపోతుంది, కాని మనం అనుకొన్నంత తేలికగా అదిపోదు. ద్వంద్వాలు చైతన్యంలో లేవు,

మనస్సుకే ఇవి అన్నీ. నీవు ద్వంద్వరహితస్థితిని పొందినప్పుడు దేహం ఉంటే శాంతి, దేహం పోయినా శాంతే, ఎటుచూసినా ఆనందమే, లోకం కనిపిస్తే ఆనందం, లోకం కనిపించకపోతే ఆనందం, ఆ స్థితిని పొందటానికి ప్రయత్నం చెయ్యి. దేహం నీవు కాకపోయినా, ఈ దేహమే నేను అనే బుద్ధిని నీకు కలుగజేస్తాడు, నీచేత ప్రారబ్ధం అనుభవింపచేయటానికి ఈశ్వరుడు చేసిన చమత్కారం అది. దూడను ఫ్రీగా వదిలివేసినప్పుడు మనం దానిని కొట్టలేము. కట్రాడుకు కట్టేస్తే ఎన్ని దెబ్బలు అయినా కొట్టవచ్చు. ప్రారబ్ధం నీచేత అనుభవింపచేయటానికి నిన్ను దేహం నేను అనే కట్రాడుకు కట్టేసాడు.

ఈ మధ్యన ఒక రమణభక్తుడు ఏమని చెప్పాడు అంటే బాహ్యంగా మనకు ఎవరైనా అండగా ఉన్నారు అనుకోండి, వారు మాకు కొండంతబలం అంటాము అలాగే జ్ఞానం రావటానికి ఓ భగవాన్ నీవు మాకు కొండంతబలం అన్నాడు. జ్ఞానం సముపార్జించాలనే బుద్ధిని కలుగచేసిన వాడవు నువ్వే ఆబుద్ధే లేకపోతే మేము జ్ఞానం సంపాదించలేము అందుచేత నీవు మాకు కొండంత బలం అని చెప్పాడు. భగవంతుడు ఉన్నాడా, లేడా అని అడిగితే రమణస్వామి, ఆచార్యులవారు రెండు రకాలుగా చెప్పారు. రమణస్వామి ఏమని చెప్పారు అంటే "దేవుడు లేకపోతే ఏ గొడవలేదు, నిజంగా ఉంటే నీ అవసరం వాడికి లేదు" అని చెప్పారు. ఆచార్యులవారు ఏమి చెప్పారు అంటే "నీవు భగవంతుడు ఉన్నాడనే బతుకు, లేడని బతకవద్దు. ఒకవేళ వాడు లేడు అని బతుకుతావు అనుకో తీరా ఉంటాడు అనుకో నీవు ప్రమాదంలో పడతావు. భగవంతుడు ఉన్నాడని బతుకుతావు అనుకో వాడు నిజంగా లేడు అనుకో నీకు వచ్చే ప్రమాదం ఏమీ లేదు". ఆ గదిలో పాము ఉందని కొందరు, లేదని కొందరు అంటున్నారు. నువ్వు చేత్తో కర్రపట్టుకొని వెళ్ళు ఉంటే చంపివేయవచ్చు, పాము అక్కడ లేదు అనుకో నీ చేతిలో కర్ర ఉండటం వలన నీకు వచ్చే నష్టం ఏమీలేదు. ఒక ప్లీడర్‌గారు దేవుడు ఉన్నాడా, లేడా అని భగవాన్‌ను అడిగారు. నువ్వు ఉన్నావా లేదా అని భగవాన్ ఆ ప్లీడర్‌గారిని ప్రశ్నించారు. నేను ఉన్నానండి అని ఆయన చెప్పారు. నువ్వు ఉంటే వాడు లేకుండా ఎక్కడికి పోతాడు, నువ్వు ఉంటే నువ్వు చేసిన పనులకు వడ్డించటానికి వాడు ఉంటాడు కాని నువ్వు ఎంత నిజమో వాడు కూడా అంతే నిజం అని చెప్పారు. భగవాన్ చెప్పే సమాధానాలు చాలా నేచురల్‌గా ఉంటాయి. సన్యాసులు పెళ్ళిళ్ళు చేసుకోరు, మేము పెళ్ళిళ్ళు చేసుకోలేదు సన్యాసులుగా ఉంటున్నాము అని కొంతమంది ఒకటే గోల, గోలగా చెపుతారు. నేను పెళ్ళి చేసుకోలేదు అని భగవాన్ ఎప్పుడూ చెప్పలేదు. నా దేహప్రారబ్ధంలో పెళ్ళిలేదు అందుచేత అవ్వలేదు అని చెప్పారు. ఎంతబాగా చెప్పారో చూడండి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 15-12-2004, ఆలమూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం పూజ చేతులతో చేస్తాము, జపం నోటితో చేస్తాము, ధ్యానం మనస్సుతో

చేస్తాము. ఈ పూజ, జపం, ధ్యానం ఇవి అన్నీ ఇంద్రియ నిగ్రహం కోసం, మనో నిగ్రహం కోసం ఏర్పాటు చేసారు. ఒక పని మనం చేసేటప్పుడు అది ఎందుకు చేస్తున్నాము అనేది తెలుసుకొని చెయ్యాలి. భగవంతుడు ఎందుకు అంటే భక్తి కోసం, భగవంతుడు ఉన్నాడు అని అనుకోకపోతే భక్తి నిలబడదు, ఉపాసన నిలబడదు. భగవంతుని యందు మనకు సరిగ్గా భక్తి కుదిరితే, శ్రద్ధ కుదిరితే, ఈశ్వరుడు ఉన్నాడు అని మనకు నమ్మకం కుదిరితే మనకు కాలం తెలియదు, దేశం తెలియదు. ఈ దేహం ఉండగానే దేశ కాలములకు అతీతమైన స్థితిని పొందుతాము. అన్నం వండుకోవటానికి, కూర వండుకోవటానికి కూడా మనకు ఎంతో కొంత ఖర్చు అవుతుంది. కానీ మోక్షం పొందటానికి ఆ ఖర్చు కూడా ఏమీ లేదు. ఏదో ఖర్చు పెట్టేస్తే మనకు మోక్షం వచ్చేస్తుంది అని చాలామంది అనుకొంటున్నారు అలా ఏమీరాదు. భగవంతుడు మనకు ఎంత బాగా చెప్పాడు అంటే మీరు పళ్ళు ఇవ్వండి, పళ్ళు దొరకలేదు అనుకోండి పుష్పాలు ఇవ్వండి, పుష్పాలు కూడా దొరకలేదు అనుకోండి నీళ్ళు అయినా ఇవ్వండి చాలు అని చెప్పాడు. నీటికి ఖర్చు ఏముంది? అక్కడ భక్తి ప్రధానం. మనకు మంచితనం ఉండవచ్చుగాని మనం మంచివారము అనుకొంటే మటుకు మరల అహంభావన పెరిగిపోతుంది. పెద్దలు ఏమని చెపుతున్నారు అంటే నువ్వు ఏదైనా ఒకపని చెయ్యవచ్చు కాని అది నేను చేస్తున్నాను, నేను సాధిస్తున్నాను అని ఆతలంపు పెట్టుకోవద్దు. ఆ తలంపే నిన్ను బంధిస్తుంది, ఆ మొదటి తలంపే అన్ని బాధలకు కారణం. మనం ఏ మార్గంలో ప్రయాణం చేసినా మనం ఇప్పుడు ఏదైతే నేను, నేను అని అంటున్నామో ఆ నేనులో నుండి విడుదల పొందటమే మన జీవితగమ్యం. ఈ గదిలో ఒక వస్తువు ఉంది అనుకోండి వెలుతురు లేకపోతే ఆ వస్తువు నాకు కనబడదు, వెలుతురు లేనప్పుడు కూడా ఆ వస్తువు అక్కడే ఉంది, మీరు బేటరీలైటు వేసి చూస్తే అది కనబడుతుంది. ఆ వెలుగు వస్తువును తయారు చెయ్యలేదు, అక్కడ ఉన్న వస్తువును ఉన్నట్లుగా ఆ వెలుతురు మనకు చూపిస్తోంది. అదే విధంగా మన హృదయంలో బ్రహ్మం ఉంది. మనకు తెలిసినా, తెలియకపోయినా హృదయంలో బ్రహ్మం ఉంది. జ్ఞానం అనే వెలుతురు హృదయంలో ఉన్న వస్తువును మనకు చూపిస్తుంది. మనం ఆత్మజ్ఞానం సంపాదిస్తే హృదయంలో ఉన్న బ్రహ్మం మనకు గోచరమవుతుంది.

మనం నేను యొక్క వాడకం తగ్గించాలి. నేను అది సాధించాను, ఇది సాధించాను అనే గొడవలు వద్దు. భగవంతుడి యొక్క సంకల్పం లేకుండా, భగవంతుడికి తెలియకుండా మనవల్ల ఏమీ అవ్వదు. భగవంతుడు అనుకొంటే అది మన శరీరం ద్వారా జరుగుతుంది కాని లేకపోతే జరగదు. మనం చేసేపని మన మనస్సుకు పవిత్రత తీసుకొని రావాలి, ఏకాగ్రత తీసుకొని రావాలి. ఈ ప్రపంచంలో ఏమీ లేదు. ఈ ప్రపంచాన్ని చూసి మోసపోవద్దు, మోహపడవద్దు. మనం ట్రైనింగ్ పొందటానికి ఇక్కడకు వచ్చాము అంతే. మనం ఏదిగా ఉన్నామో దానికి ఈ మనస్సుతో గాని, మనకు వచ్చే తలంపులతోగాని, దేహం యొక్క చావు

పుట్టుకలతోగాని ఎట్టి సంబంధం లేదు, అది గుర్తుపెట్టుకోండి. అది గుర్తిస్తే మనకు చావు అంటే భయం పోతుంది. నామీద నాకు విశ్వాసం లేనప్పుడు, ఈశ్వరుడి మీద విశ్వాసం లేనప్పుడు, నాకు ఆత్మబలం లేనప్పుడు నాకు భయం వస్తుంది. నాకు ఆత్మవిశ్వాసం కనుక ఉంటే, నిజంగా భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని ఆయన సంకల్పాన్ని నూటికి నూరు పాళ్ళు గౌరవించే మనస్థత్వం నాకు ఉన్నప్పుడు నేను భయాన్ని విడిచిపెట్టటంకాదు, భయం నన్ను విడిచిపెట్టేస్తుంది. మన మాట ద్వారాగాని, చేతద్వారాగాని, శ్రవణం ద్వారాగాని మనస్సు కలుషితం అవ్వకుండా చూసుకోవాలి. సత్యాన్ని సాక్షాత్కారం చేసుకొన్నవాడిని సత్పురుషుడు అంటారు, అటువంటి సత్పురుషులతో సహవాసం వలన మనకు ఇన్స్పిరేషన్ వస్తుంది, వారు ఏ స్థితిని అయితే పొందారో అది మనం కూడా పొందాలి అనే కాంక్ష మనకు కలుగుతుంది. మనకు వచ్చే అశాంతికి, దుఃఖానికి అంతా మనస్సే కారణం. అందుచేత నీ మనస్సును శత్రువుగా చేసుకోవద్దు, మనస్సును మిత్రుడిగా చేసుకొని మనస్సు యొక్క సహాయంతో నిన్ను నీవు ఉద్ధరించుకో అని భగవంతుడు చెపుతున్నాడు. మనకు తెలిసినా, తెలియకపోయినా మన హృదయంలో ఒక సద్వస్తువు ఉంది. ఆ వస్తువు ఉన్నది ఉన్నట్లుగా మనకు వ్యక్తం అవ్వకుండా ఏ బలహీనతలు అయితే అడ్డువస్తున్నాయో వాటిని తొలగించుకోవటానికి మనం ప్రయత్నం చేయాలి. భగవంతుడికి శరణాగతి చెందాలి. భగవంతుడి సంకల్పం యందు గౌరవం కలిగి ఉండాలి. మనకు ఏది మంచిదో మనకంటే ఆయనకు బాగా తెలుసు. అందుచేత అది కావాలి, ఇది కావాలి అని భగవంతుడిని అడగకూడదు. భక్తి లేకుండా, శరణాగతి లేకుండా కొంతమంది గుడికి వస్తే ధనంకోసం వస్తారు, పూజ చేస్తే ధనం కోసం చేస్తారు, వారికి మోక్షం అక్కరలేదు. లౌకికంగా చేసే పనులు ధనంకోసం చేస్తారు. దేవుడు పేరుమీద చేసేపని కూడా ధనం కోసం చేస్తారు. కొంతమంది ధనవంతుల చుట్టూ, కొంతమంది అధికారుల చుట్టూ, కొంతమంది జ్ఞానుల చుట్టూ తిరుగుతూ ఉంటారు. దానినిబట్టి వారి మనస్సు ఎలా పనిచేస్తోందో మనకు తెలుస్తూ ఉంటుంది. ఎప్పుడయినా మీ కోరికలు నెరవేరినప్పుడు మీకు శాంతి వస్తూ ఉంటుంది, అది నిజం కాదు, అది లౌకికమైన శాంతి. అభౌతికమైన శాంతి, అలౌకికమైన శాంతి మనకు వచ్చే వరకు శవాలు మనలను విడిచిపెట్టవు. లోపల మొత్తం మీకు ఎన్ని అయితే కోరికలు ఉన్నాయో, ఏ వాసనలు అయితే ఉన్నాయో, ఈ దేహానికి లోకానికి బంధించే విషయాలు ఎన్ని అయితే ఉన్నాయో వాటిని అన్నింటిని పూర్తిగా త్యజించు అని భగవంతుడు చెపుతున్నాడు. మనకు అందరికీ బుద్ధి ఉంది కాని అది అందమైన బుద్ధికాదు, మనకు అందరికీ డబ్బు ఉందికాని అది అందమైన డబ్బుకాదు, మనకు అందరకు తెలివి ఉందికాని ఆ తెలివిలో అందంలేదు. మనకు ధనం ఉంటే ఆ ధనాన్ని మంచి విషయాలకుకనుక వినియోగిస్తే ఆ ధనానికి అందం వస్తుంది. కాని మనం మంచి విషయాలకు ధనాన్ని వినియోగించము అంటే మనకు ఉన్న ధనానికి అందం లేదు. మన తెలివి ఎవరికీ ఉ

పయోగపడదు అంటే మన తెలివిలో అందంలేదు. మనం మాట్లాడుతూ ఉంటే సరిపోదు, ఆ మాటకు అందం ఉండాలి. మనకు ధనం ఉంటే సరిపోదు అందులో అందం ఉండాలి. మనకు తెలివి ఉంటే సరిపోదు, ఆ తెలివిలో అందం ఉండాలి. ఏదోరకంగా జీవిస్తున్నాము అంటే సరిపోదు, ఆ ప్రవర్తనకి అందం ఉండాలి. అందంలేని ధనంకాని, అందంలేని ప్రవర్తనకాని, అందంలేని వాక్కుకాని, అందంలేని తెలివికాని సమాజానికి ఉపయోగపడవు, నువ్వు ఉత్తమస్థితిని పొందటానికి ఉపయోగపడవు. మనం ఏ జన్మకు ఆ జన్మ మనస్సుతోటి, దేహంతోటి తాదాప్యం పొందటం వలన మన హృదయంలో వస్తువు ఉన్నప్పటికీ అది లేనట్లుగా మనకు కనిపిస్తోంది. నువ్వు ఏదైనా పని చేస్తున్నావు అనుకో ఆ పని ద్వారా ఈశ్వరుడు ఆరాధింపబడాలి. మనం ఏదైనా మంచి పని చేసినా పదిమంది గౌరవిస్తారేమో అని చెయ్యటం కాని భగవంతుడి ప్రీతికోసం మనం చేయటంలేదు. కొంతమంది పనిచేస్తారు ఫలితం ఎప్పుడు వస్తుందా అని కనిపెట్టుకొని ఉంటారు. ఇంక మీకు శాంతి ఏమిటి? శాంతిరాదు, తలకాయపోటు వస్తుంది. నీకు శాంతి కావాలి అంటే నీవు స్పృహ లేకుండా జీవించు. ఫలకాంక్ష వద్దు, అది ఎప్పుడు ఇవ్వాలో భగవంతుడు ఇస్తాడు. కర్మఫలం కోసం ఎదురుచూస్తూ ఉంటే నీకు శాంతిరాదు. ఇంత స్పష్టంగా చెపుతూ ఉంటే మనం వినకపోతే ఎలాగ. రామకృష్ణుడు ఏమి చెప్పారు అంటే నీవు ఇంట్లో వారికి ఏదైనా సేవ చేస్తూ ఉన్నా ప్రారబ్ధాన్ని అనుసరించి వారికి సేవ చేస్తున్నాను, వారు మటుకు నావాళ్ళు కాదు అని లోపల అనుకొంటూ నీవుచేసేది ఇష్టంతో చెయ్యి. అలా పనిచేస్తూ ఉంటే నీ దేహం ఉండగా వారు వెళ్ళిపోయినా నీశాంతికి భంగంరాదు. ఎవరి సమక్షంలో శాంతితరంగాలు వచ్చి మనలను ముంచుతాయో వారే సత్పురుషులు.

చాలామంది వర్తమానకాలాన్ని వదిలేస్తారు, భవిష్యత్‌కాలం గురించి లేకపోతే భూతకాలం గురించి తలపెట్టుకొంటూ ఉంటారు. వారు సాధకులు కాదు, వారు కాలాన్ని సద్వినియోగం చేసుకోవటం లేదు అని అర్థం. వారు భగవంతుని దయకు పాత్రులు కాలేరు. నీ పని ఏదో నువ్వు చేసుకొంటూ వెళ్ళిపో, లోపల మమకారం ఏమీ పెట్టుకోవద్దు. ఎందుచేతనంటే మమకారం పాపాన్ని తీసుకొని వస్తుంది, మమకారం అశాంతిని తీసుకొని వస్తుంది. మమకారం అశాంతిని తీసుకొని వస్తుంది కాబట్టి దానిని విడిచిపెట్టమని భగవంతుడు చెప్పాడు. భగవంతుడు ఏదైతే మనలను విడిచిపెట్టమని చెపుతున్నాడో దానిని విడిచిపెడితే ఆయన మనకు స్వరూపంగా వ్యక్తమవుతాడు. మమకారమే మనకు బంధం, మమకారం లేనివాడికి బంధం లేదు. అర్జునా! నీవు అహంకారం లేకుండా, మమకారం లేకుండా ఈ కౌరవ సైన్యాన్నే కాదు మూడు లోకాలను నువ్వు భస్మం చేసినా నీకు పాపం రాదు, దోషం రాదు అని పరమాత్మ చెప్పాడు. నువ్వు కానిదేహంతోటి, నువ్వుకాని మనస్సుతోటి నువ్వు తాదాప్యం పొందుతున్నంతకాలం నీకు మిగిలేది అశాంతి, నీకు మిగిలేది దుఃఖం, నువ్వు దుఃఖరహితస్థితిని పొందలేవు. ఎంతకాలం అయితే నీవు దుఃఖరహితస్థితిని పొందలేవో

అంతకాలం నీవు జన్మరాహిత్యస్థితిని పొందలేవు. భగవంతుడు చెప్పినట్లుగా అహంకారం లేకుండా, మమకారం లేకుండా ఎవడైతే జీవిస్తున్నాడో వాడికి శీఘ్రంగా ఈ శరీరం శవం అవ్వకముందే ఈ భూమి మీద ఉండగానే పరమశాంతి, శాశ్వత శాంతి వాడిని వరిస్తుంది, అప్పుడు దేహం ఉన్నా లేకపోయినా, లోకం కనిపించినా కనిపించకపోయినా నువ్వు నువ్వుగా ఉంటావు. ఇప్పుడు నీకు ఉండాలని ఉందా లేక చావాలని ఉందా? నీకు ఉండాలని ఉంటే నిన్ను నువ్వు పోగొట్టుకో అప్పుడు ఉంటావు అంటున్నారు భగవాన్. ఏదైతే నేను, నేను అనుకొంటున్నావో దానిని పోగొట్టుకొంటే నువ్వు ఉంటావు. నీకు శాశ్వతంగా ఉండాలని ఉంటే నేను చనిపోతున్నాను, నేను పుడుతున్నాను అని ఎవడైతే అంటున్నాడో వాడిని పోగొట్టుకొంటే నువ్వు ఎప్పుడూఉంటావు. అప్పుడు ఉన్న నువ్వే మోక్షం, ఆనువ్వే శాంతి. అప్పుడు శాంతికోసం బాహ్యమైన వస్తువుల మీద గాని, వ్యక్తులమీదగాని, సంఘటనల మీదగాని ఆధారపడనక్కరలేదు. అప్పుడు శాంతికోసం నీవు ఎక్కడికి వెళ్లనక్కరలేదు. శాంతే వచ్చి నిన్ను వరిస్తుంది. అప్పుడు నీకు ఉన్న ఐశ్వర్యం, అధికారం, నీకు ఉన్న గొప్పలు అన్నీ కూడా గడ్డిపరకలకింద నీకు కనిపిస్తాయి అది అట్టిది. సముద్రంలో నీటి బుడగ ఎటువంటిదో మనం పొందవలసింది పొందాక మనకు ఉన్న ఐశ్వర్యాలు అటువంటివే.

రాగద్వేషముల వలన మన మనస్సు పాడైపోయింది, అందుచేత భగవంతుడు చెప్పిన మాటలు మనం వినటంలేదు. మనకు భగవంతుడి యందు భక్తి ఉండాలి, దానికి కారణం కనబడకూడదు. నీకు భక్తి ఉందని అదీ ఇదీ అడుగవద్దు, భగవంతుడితో వ్యాపారం చేయవద్దు. నీకు ఏది ఎప్పుడు కావాలో ఆయన ఇస్తూ ఉంటాడు. ఆయన సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు, సర్వసాక్షి. ఆయనను అడగవలసిన పనిలేదు, నిన్ను ఎప్పుడు అలంకరించాలో అప్పుడు అలంకరిస్తాడు. అడగకపోతే ఆయన ఇవ్వడేమో అని నీవు అనుకొంటావు దానివలన అహంభావన పెరుగుతుంది. మనకు ఏదైతే నేనుగా వ్యక్తమవుతోందో అది ఆత్మ పార్టీకాదు, దేహం పార్టీకాదు. అది ఎలా వచ్చిందో మధ్యలో వచ్చింది. అది ఎలా వచ్చింది అని వెనక్కి వెళ్ళి చూసుకోవటంకంటే దానిని ఊడగొట్టుకోవటం మంచిది. అది మధ్యలో వచ్చింది కాబట్టి విచారణ చేస్తే అదిపోతుంది. అదిపోతే ఎలాగ ఉంటావు అంటే నీకు తలకాయపోటు తగ్గాక ఏమీ అయిపోవు, తలకాయపోటు రాకముందు నీవు ఎలాగ ఉన్నావో అలాగ ఉంటావు అలాగే దేహగతమైన నేను నశించాక అది లేనప్పుడు నువ్వు ఎలాగ ఉన్నావో అలాగ ఉంటావు, అదే మోక్షం. భగవంతుడు నీకు ఏది ఇస్తే నువ్వు దానితోటి సంతృప్తిపడు, భగవంతుడు నీకు అనుగ్రహించనిదానికోసం ఆరాటపడవద్దు. అది ఆపుచెయ్యాలనే ఆయన ఆపుచేసాడు ఎందుచేతనంటే అది ఇస్తే నువ్వు పాడైపోతావు, అది ఆయనకు తెలుసు, అది నీకు తెలియదు కాబట్టి ఆరాటపడుతున్నావు. మనం ఇంకా బతకాలి, ఇంకా బతకాలి అని అనుకొంటున్నాము కదా, అలా అనుకొనేవాడు ఎవడు? వాడిని తీసి ఒక ప్రక్కన పెట్టు, నువ్వు ఎవడివో నీకు తెలియబడుతుంది. మాకు చాలా కష్టాలు వస్తున్నాయి

అంటారు. కష్టాలు ఎవరికి వస్తున్నాయి? పుట్టని వస్తువుకు కష్టాలు లేవు, పుట్టిన దేహానికి కష్టంలేదు. మధ్యలో వచ్చి ఈ దేహం నాది, దేహమే నేను అని ఎవడైతే చెపుతున్నాడో వాడికే కష్టాలు. వాడిని తీసివేస్తే ఇంక కష్టం ఏముంది. వాడిని మీరు అలాగే ఉంచుకొంటారు అనుకోండి ఒక కష్టం తరువాత ఇంకో కష్టం, ఒక శరీరం పోయాక ఇంకో శరీరం వస్తూ ఉంటాయి అంటే ఒక గొయ్యిలో నుండి ఇంకో గొయ్యిలో పడుతూ ఉంటాము. ఈ దేహమే నేను అని దేహంతో ఏ తలంపు అయితే తాదాప్యం పొందుతోందో దానికే కష్టాలు, విచారణ చేసి దానిని ఊడగొట్టుకో, అదే మోక్షం. ఈ చిన్న విషయానికి ఎందుకు గందరగోళపడి పోతున్నావు. ఒకడు భగవాన్ దగ్గరకు వచ్చి నేను దేవుడిని స్మరించను అన్నాడు. మరి మనస్సు ఉంది కదా నీవు ఏదో ఒకటి స్మరించకుండా ఉండలేవు, దేవుడిని స్మరించకపోతే నీవు సైతానును స్మరిస్తున్నావు అని అర్థం అన్నారు. నీకు దైవచింతన లేనప్పడు విషయచింతన వచ్చేస్తుంది. అప్పడు నీకు మిగిలేది అశాంతి. నువ్వు ఎవరినో ఉద్ధరించటం కాదు ముందు నిన్ను నీవు ఉద్ధరించుకో. కొంతమంది మేము ప్రజలను ఉద్ధరిస్తాము అని చెపుతూ ఉంటారు. ప్రజలు ధనవంతులు అవ్వరుగాని, ఉద్ధరిస్తాము అని చెప్పేవారు ధనవంతులు అవుతారు, ఇదే మాయ. స్వార్థం లేకుండా నీవు జీవితంలో ఎప్పడైనా ఒక పనిచేసావా, నీ శరీరాన్ని, మనస్సును, గౌరవాలను మర్చిపోయి ఎప్పడైనా నీవు ఒక మంచి పని చేసావా, స్వార్థం లేకుండా ఎప్పడైనా ఒక మాట మాట్లాడావా. ఇంక నీవు ప్రజలను ఏమి ఉద్ధరిస్తావు. మనం ఓట్లకోసం, గౌరవాల కోసం ఏదైనా పని చేసాము అనుకోండి అది కూడా స్వార్థమే. స్వార్థం లేకుండా నీవు పని చెయ్యి, అప్పడు నీ మనస్సు బాగుపడుతుంది, మనస్సు అణుగుతుంది, అణిగిన మనస్సుకు ఆత్మజ్ఞానం కలుగుతుంది అని భగవంతుడు చెపుతున్నాడు.

కొంతమంది చెపుతూ ఉంటారు మాలో ఏమీ లోపాలు లేవండి, మేము మంచి వారము, స్వార్థం లేకుండా పని చేస్తున్నాము అంటారు. మరిమీలో దోషాలు లేకపోతే, మీ బుద్ధిలో వంకరలు లేకపోతే మీకు ఆత్మజ్ఞానం రావాలి కదా మరి ఎందుకు రావటం లేదు. మీలో ఉన్న అన్నిరకాల పాపాలలోనుండి, దోషాలలో నుండి, బలహీనతలలో నుండి విడుదలపొందితే మీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. మీరు అందరూ విడుదల పొందాము అనుకొంటున్నారు కదా మరి ఆత్మజ్ఞానం మీకు ఎందుకు రాలేదు అంటే మిమ్మల్ని మీరు వంచన చేసుకొంటున్నారు. ఇంటిలో కూర్చొని మేము మంచివారము, మేము మంచివారము అని చెప్పకోవటం. నిజంగా మంచివారికి వారు మంచివారు అనే సంగతి తెలియదు. మేము మంచివారము అని చెపుతూ ఉంటే అక్కడ అహంకారం ఉంది. అహంకారం ఉన్నవాడు మంచివాడు ఎలా అవుతాడు. అంటే ఏది పోగొట్టుకోమని భగవంతుడు చెపుతున్నాడో దానిని వాడు పెంచుకొంటున్నాడు. ఎవడైతే అహంకారరహితుడిగా, మమకారరహితుడిగా ఈ భూమిమీద జీవకోటి మధ్యలో చరిస్తున్నాడో వాడే కదా పరమస్థితిని పొందేది. నీకు భగవంతుడి మీద నమ్మకం లేదు అనుకో, ఏదైతే నీకు నేనుగా వ్యక్తమవుతోందో దానిని తొలగించుకో, దాని మూలం తెలిస్తేగాని అది

తొలగింపబడదు. దానిమూలం తెలియకుండా అది నశించదు. మూలతలంపు యొక్క మూలం ఎంత లోతులలో ఉందో అంత లోతులలోనికి వెళ్లటానికి అభ్యాసం చెయ్యి, అభ్యాసం వల్ల అన్నీ చక్కబడతాయి. మీరాభాయి బంధువులు ఏమన్నారు అంటే నీవు భక్తి అని ఇలా తిరుగుతున్నావు, కుటుంబ గౌరవం పోతుంది అని చెప్పారు. అప్పడు మీరాభాయి ఏమిచెప్పింది అంటే ఈ గౌరవం అనేది, అగౌరవం అనేది లోకానికి సంబంధించిన విషయాలు. భగవంతుడు నాకు కావాలి కాని భగవంతుడు కల్పించిన లోకం నాకు అక్కరలేదు అని చెప్పింది. మనకు భగవంతుడు అక్కరలేదు, భగవంతుడు కల్పించినవి కావాలి. మనం ఏదైతే నేను నేను అంటున్నామో అది నూటికి నూరుపాళ్ళు అసత్యం అయినప్పటికీ, నూటికి నూరుపాళ్ళు సత్యం అనే భావన మనకు ఉంది అందుచేత అందులోనుండి విడుదల పొందలేకపోతున్నాము. మనం అందరం ఏదో పైకి మాటలు చెప్పినా ఈ నేను పోతే మనం ఉండము అనే భయం కూడా మనకు ఉంది. ఈ నేనుపోతే మనం ఎప్పడూ ఉంటాము. మనం ఎప్పడూ ఉండటానికే దానిని పోగొట్టుకోవటం అంతేగాని చావటానికి కాదు, నీవు చావాలంటే దానిని అట్టేపెట్టుకో అని చెపుతున్నారు.

గణపతి శాస్త్రిగారు రమణమహర్షి మీద పద్యం వ్రాస్తూ ఏ ప్రపంచం అయితే మేము గొప్పది అనుకొంటున్నామో, ఏ ప్రపంచ విషయాలు అయితే మేము రోజూ స్మరిస్తున్నామో, ప్రపంచంలో ఉన్న ఏ గొప్పలకోసం, గౌరవాలకోసం మేము ఆరాటపడుతున్నామో ఓ రమణా! నీ దృష్టిలో ఆ ప్రపంచం అంతా ఒకనీటి బుడగకదా అన్నారు. మాకు ఏదైతే గొప్పో అది నీకు కనీసం నీటి బొట్టు కూడా కాదు, నీటి బుడగ. మన అహంకారం ఏదో గొప్పది, ఇందులో ఏదో విశేషం ఉంది అని అనుకొంటున్నాము అందుచేత దానిని విడిచిపెట్టలేకపోతున్నాము. ఇది ఎందుకు పనికిరాని చెత్త అని మనకు తెలియటంలేదు. భగవంతుడు చెప్పిన మాటయందు గౌరవం పెంచుకొంటూ ఉంటే, ఆ మాట యొక్క అర్థం మీ గుండెకు తాకుతూ ఉంటే అహంకారం అనేది ఎందుకు పనికిరానిది అనే విషయం మీకు అర్థమవుతూ ఉంటుంది, దాని అల్పత్వం మీకు తెలుస్తూ ఉంటుంది, అప్పడు దానిని విడిచిపెట్టటం మీకు తేలిక అవుతుంది. మీకు గురువు అంటే ఇష్టం అనుకోండి, దేవుడు అంటే ఇష్టం అనుకోండి. ఆ గురువు యొక్క నామాన్ని లేకపోతే ఆ దేవుడియొక్క నామాన్ని స్మరించగా స్మరించగా ఆయన రూపాన్ని ధ్యానించగా, ధ్యానించగా మీ మనస్సు ఆ నామంమీద, ఆరూపం మీద నిలబడుతుంది. అప్పడు దానికి వచ్చే ఇతరతలంపులు తగ్గిపోయి, అది సన్నగిల్లి దానంతట అదే రాలిపోతుంది. కృష్ణుడు మనతోటి ప్రకృతిలో ఉన్నట్లు ఉంటాడు. మనతో కలిసి మాటలు చెపుతూ ఉంటాడు, మనతో తిరుగుతాడు, అన్నీ చేస్తూ ఉంటాడు. ఇలా చేస్తూ మనలను ఈ ప్రకృతిని దాటించి చైతన్యంలో కలిపేవాడు గోవిందుడు. ఆయన నామాన్ని స్మరిస్తూ ఉంటే, ఆయన రూపాన్ని ధ్యానిస్తూ ఉంటే, ఆయన లీలలు వింటూ ఉంటే మనకు తెలియకుండానే ఈ ప్రకృతిని దాటించి చైతన్య స్రవంతిలో ఐక్యం చేస్తాడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 25-01-05 | మంగళ | తాడినాడ |
| 31-01-05 | సోమ | జువ్వలపాలెం |
| 05-02-05 | శని | పాలకోడేరు |
| 07-02-05 | సోమ | గుమ్మలూరు |
| 09-02-05 | బుధ | మురమళ్ళ, వీరేశ్వరస్వామివారి దేవస్థానం |

# శాశ్వతమైన సుఖము

ప్రతి మనిషి కోరుకోవలసింది శాశ్వతము, పూర్ణమూ అయిన ఆనందాన్నే! కాని మనము చేయుపొరపాటు ఇంద్రియముల ద్వారా, విషయముల ద్వారా ఆనందాన్ని పొందాలనుకోవడం. ఇంద్రియాలు, విషయాలు ద్వారా పొందే సుఖము భ్రాంతి మాత్రము. అట్టి వస్తువులు, విషయాలతో సంయోగముతో కన్నా వియోగము వలననే ఎక్కువ ఆనందాన్ని పొందుతాం. ఎంతకాలము నశించే విషయాలు, దేహము, ఇంద్రియముల ద్వారా సుఖాన్ని పొందాలని కోరుకొంటామో, అంతవరకు వాటికి అతీతమైన పరమశాంతి, సుఖము మనకు దొరకదు. శాశ్వతమైన సుఖము, ఆనందము మన స్వరూపంగానే ఉంది. అట్టి ఆనందానుభవం కోసం వ్యథను విడనాడి "నేనెవరను?" అను విచారణ ద్వారా మనస్సును అంతర్ముఖం చేస్తే శాశ్వతానందానికి మార్గం గోచరిస్తుంది.

కోర్కెల వల్ల అలజడి కలిగి ఆ అలజడి వల్ల మనస్సు విచార గ్రస్తమవుతుంది. కోర్కెలను విడవగలిగితే మనస్సులోని ఆలోచనల అలజడి తగ్గుతుంది. శాంతించిన మనస్సే ఆనందానికి ఆటపట్టు. కోర్కెలు తగ్గే కొలది మనస్సు తూకం పెరిగి ఆనందం పెరుగుతుంది. కావున దేహేంద్రియమనోబుద్ధుల వలన కలిగే సుఖము నశించేది, నిస్సారమైనది, ముగింపుకలది. కాని ఆత్మానందము నశింపనిది, ఎప్పటికప్పుడు తాజాగా ఉండి వృద్ధి పొందేది. కాబట్టి ఆత్మానందాన్నే మనము కోరుకోవాలి. ఈ జగత్తులో ద్వంద్వాలనుండి విముక్తి పొందితే ఇప్పుడే ఇక్కడే పరమశాంతిని పొందగలము

**చావలి సూర్యనారాయణ**

**టీచర్, అమలాపురం**

# ప్రథమ కర్తవ్యం

అద్వైతులుగాని, విశిష్టాద్వైతులుగాని అంతా అహంకారం నశించాలనే విషయంలో ఏకీభవిస్తున్నవారే. కనుక, దానికొరకై ముందు ప్రయత్నించడం మంచిది. ఆత్మసాక్షాత్కారం వేరు, పరమాత్మసాక్షాత్కారం వేరు. అది దీనికి సోపానం అని తర్జనభర్జనలు పడనక్కరలేదు. ఆత్మలు రెండు లేవు. ముందు ఆత్మసాక్షాత్కారం పొందితే, తర్వాత ఏమి అయ్యేదీ అప్పుడే తెలుస్తుంది.

- భగవాన్ శ్రీ రమణ మహర్షి

## రమణ భాస్కర

**బి. మల్లిఖార్జునరావు**

శ్రీరమణ క్షేత్రం, జిన్నూరు - 534 265, ప॥గో॥ జిల్లా, ఆంధ్రప్రదేశ్

రమణ భాస్కర సంవత్సర చందా (ది॥ 23-09-2004 నుండి ది॥ 23-09-2005 వరకు) నిమిత్తం రు॥ 150/-లు పంపుచున్నాను.

పేరు ..........................................................................................

తండ్రి / భర్త ..........................................................................................

డోర్ నెం .......................................... వీధి పేరు ..........................................

గ్రామం .......................................... పిన్ కోడ్ ..........................................

మండలం .......................................... జిల్లా ..........................................

డి.డి. / యం.ఒ. ..........................................................................................

ఫోన్ (ఎస్‌టిడి కోడ్‌తో సహా) ..........................................................................

## మనవి

1. ఈనెల నుండి రమణ భాస్కర సంవత్సరచందా చెల్లించదలచినవారు డి.డి. లేదా మనియార్డరుతోపాటు ఈ పై కూపనును పూర్తిచేసి పంపవలసినదిగా కోరి ప్రార్థిస్తున్నాము.

2. రమణ భాస్కర సరిగా అందకపోయిన / మీ అడ్రసు మారిన మేము మీకు పంపే పుస్తకంమీద మీ పేరు ముందు ఉన్న నెంబరును వ్రాస్తూ పై కూపనులోని పూర్తి వివరములను పూర్తిచేసి పంపిన ఎడల పత్రిక మీకు పంపబడును.